
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం | 3 | జూన్ | 2023



నిత్యాన్నదానానికి విరాళం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి సత్తి హర్షరెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.100116 విరాళం అందించారు.



తూర్పు డెల్టాకు పెంపు

ధవళేశ్వరం: బ్యారేజ్ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 500, మధ్యడెల్టాకు 50, పశ్చిమ డెల్టాకు 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
44.0°/27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	44.0	28.5
కాకినాడ	41.3	28.0
అమలాపురం	42.0	27.0

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: నాలుగు మండలాల్లో ఖాళీగా ఉన్న 10 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కేటీఎల్‌డీ కుమారి శుక్రవారం తెలిపారు. అమలాపురం మండలం ఎ.వేమవరం శివారు ఎస్‌సీ పాలెం, అంబాజీపేట మండలం నందంపూడి–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే అమలాపురం మండలం రంగాపురం శివారు కొడవల్లి, ఇందుపల్లి శివారు ఇందుపల్లి కాలనీ, అంబాజీపేట మండలం మాచవరం శివారు కుముజువారిపేట, మెట్ల కాలనీ, వాకలగరువు శివారు వాకలగరువు బండివారిపేట, అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు మిలిటరీ కాలనీ, దేవగుప్తం శివారు సంత మార్కెట్, ఉప్పలగుప్తం శివారు ఆదిలక్ష్మీపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వివరించారు. స్థానికులైన వివాహిత మహిళలు మాత్రమే ఈ పోస్టులకు అర్హులు. గత ఏడాది జులై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలి. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తుతో పాటు 10వ తరగతి ఉత్తీర్ణత, కులం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సు కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలి. జనరల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకునే వారు నేటివిటీ సర్టిఫికెట్ జిరాక్సును గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి ఇవ్వాలి. ఆసక్తి, అర్హత ఉన్న వారు తమ దరఖాస్తులను ఈ నెల 6 నుంచి 14వ తేదీ సాయంత్రం లోగా తమ కార్యాలయంలో పని వేళల్లో అందజేయాలని కుమారి సూచించారు.

ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలో..

ముమ్మిడివరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ కేవీఎస్ తులసీ కుమారి శుక్రవారం తెలిపారు. కాట్రేనికోన మండలం పల్లం (ఓసీ జనరల్) కార్యకర్త; ముమ్మిడివరం మండలం గేదెల్లంక (ఓసీ జనరల్), చినకొత్తలంక (బీసీ–ఇ), కాట్రేనికోన పల్లంకుర్రు (ఎస్సీ), కాట్రేనికోన వనవల్లవారిపాలెం (బీసీ–డి), కాట్రేనికోన కందికుప్ప (ఓసీ జనరల్), ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి (బీసీ–ఎ), ఐ.పోలవరం మండలం పశువుల్లంక (ఎస్సీ) హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. కనీసం పదో తరగతి పాసైన స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. తమ కార్యాలయ పనిదినాల్లో ఈ నెల 14లోగా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అమలాపురం సమనస (బాలుర), రామచంద్రపురం (బాలికల) గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నామని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ వైఎస్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి బీసీ, ఇంగ్లిష్ మీడియం చదివిన విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోగా ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఆయా పాఠశాలల్లో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఆ పరీక్షలో వచ్చిన మార్కులను బట్టి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. అలాగే నాలుగో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కూడా ఐదో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వివరాలకు 98661 95979 (సమనస), 9989 77 2317 (రామచంద్రపురం) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఒంటికి సైక్లింగ్ మంచిదేగా..





ప్రపంచ సైకిల్ దినోత్సవం జూన్ 3న చేయడమనేది 2018లో మొదలైంది. ఈ మేరకు ప్రపంచ సైక్లింగ్ అసోసియేషన్ (డబ్ల్యూసీఏ), ఐరోపా సైక్లిస్ట్ సమాఖ్య (ఈసీఎఫ్) ఐక్యరాజ్య సమితి(యూఎన్)కి ప్రతిపాదించాయి. దీనిపై తీర్మానాన్ని యూఎన్ సమావేశంలో పాల్గొన్న 193 దేశాలు ఆమోదించాయి.

సాక్షి, అమలాపురం: అందరూ సింపుల్‌గా 'సైకిల్' అని పిలిచే 'బై సైకిల్' సామాన్యుడి వాహనం.. ఒకనాటి జీవన గమనానికి కీలక సాధనం. రైతులను నయా జమీందార్లను చేసిన అందమైన వాహనం. రోజులు మారి ఇప్పుడంటే ప్రతి ఒక్కరూ మోటార్ సైకిళ్లు కొనుగోలు చేస్తున్నారు కానీ.. ఒకప్పుడు సొంత వాహనాల్లో అతి ప్రధానమైనది సైకిలే.

సైకిల్ తొక్కడం 80వ దశకం వరకూ సామాన్యులకు నిత్యకృత్యం. రైతు పొలం వెళ్లాలన్నా.. ఎరువులు, విత్తనాలు చేలకు చేరాలన్నా.. కూరగాయలు, పాలు ఇళ్లకు రావాలన్నా.. ఇదే వాహనం. కూలీ ఎండు గడ్డి తీసుకు రావాలన్నా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలన్నా.. పోస్ట్‌మన్ ఇంటి గడప వద్దకు తీసుకు వచ్చి ఉత్తరాలు, మనీయార్డర్లు ఇవ్వాలన్నా.. గ్యాస్ సిలిండర్ ఇంటికి రావాలన్నా.. యువ జంట టూరింగ్ టాకీస్‌లకు వెళ్లాలన్నా సైకిల్ తప్పనిసరి. ఉదయం పాల ప్యాకెట్ అమ్మేవారి నుంచి రాత్రి పూల వ్యాపారి వరకూ ఇంటికి వచ్చే వర్తకులందరి వాహనమూ సైకిలే.

పట్టణాలతో పాటు కాస్త పెద్ద పల్లెల్లో సైకిళ్లు అద్దెకు ఇచ్చేవారు. వాటికి మరమ్మతులు చేసే వ్యాపారులు ఉపాధి పొందేవారు. అసలు సొంతంగా సైకిల్ ఉండటమే గొప్ప. హంబర్, హీరో, అట్లాస్, రేసెండేల్, మెన్నా, హెర్య్యులస్ వంటి కంపెనీల సైకిళ్లు ప్రధానంగా ఉండేవి.

మళ్లీ పెరుగుతున్న ఆదరణ

వేగవంతమైన ఆధునిక జీవన విధానం, పెరిగిన కొనుగోలు శక్తి ఫలితంగా సైకిళ్ల స్థానంలో మోటార్ సైకిళ్లు వచ్చాయి. దీంతో 80ల నుంచి సైకిళ్లకు ఆదరణ తగ్గుతూ వచ్చింది. మారుతున్న పరిస్థితుల పుణ్యమా అని ఇటీవల వీటికి ఆదరణ మళ్లీ పెరుగుతోంది. ముఖ్యంగా కరోనా తరువాత చాలామందిలో ఆరోగ్య స్పృహ పెరిగింది. దీంతో సైకిల్‌పై తిరిగి ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. ఉదయం సైక్లింగ్ చేయడం వ్యాయామంలో ఒక భాగమైంది.

- బై సైకిల్‌కు పూర్వ వైభవం
- 80ల వరకూ చాలామందికి ఇదే ముఖ్య వాహనం
- కరోనా తరువాత పెరిగిన ఆరోగ్య స్పృహ
- మళ్లీ పెరుగుతున్న ఆదరణ
- నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం

ఆరోగ్యానికి దివ్యౌషధం

- రోజూ సైక్లింగ్ చేయడం గుండె, రక్తనాళాలకు మంచిది. హై బీపీ తగ్గుతుంది. గుండె కండరాలు బలంగా మారతాయి. సైకిల్ తొక్కే సమయంలో ఎక్కువగా శ్వాస పీల్చడం వల్ల ఊపిరితిత్తులకు మేలు జరుగుతుంది.
- కాళ్ల కండరాలు, ఎముకలు దృఢంగా తయారవుతాయి. ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతుంది. జీవక్రియ రేటు పెరిగి, శరీరంలో కొవ్వు తగ్గడం వల్ల బరువు తగ్గుతారు.
- రోజుకు 30 నిమిషాల కంటే ఎక్కువగా సైక్లింగ్ చేసే వారిలో షుగర్ వచ్చే అవకాశం 40 శాతం తగ్గుతుంది. టైప్–2 డయాబెటిస్ చాలా వరకూ దూరమవుతుంది.

సైకిల్ పోలో

సైకిల్‌తో పలు రకాల క్రీడలు కూడా ఉన్నాయి. ఒలింపిక్స్‌లో పలు విభాగాల్లో సైకిల్ రేసులు నిర్వహించి పతకాలు ఇస్తారు. అలాగే హాకీని తలపించే క్రీడ సైకిల్ పోలో. సైకిల్‌పై వెళ్తూ హాకీ తరహాలో బ్యాట్లతో బాలును గోల్ చేస్తుంటారు. ఈ క్రీడలో మామిడికుదురు, రాజోలు ప్రాంతాల్లో పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నగురురు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రిటైర్డ్ ఎంఈఓ కొన్నలగడ్డ గోపాలకృష్ణ ఆధ్వర్యాన ఈ క్రీడకు మంచి ప్రాచుర్యం లభించింది.



సైకిల్ పోలో ఆడుతున్న జిల్లా క్రీడాకారులు

జాతీయ స్థాయిలో నాలుగో స్థానం



రాజోలు గురుకుల పాఠశాల విద్యార్థిని వై.రాజేశ్వరి సైకిల్ పోలో క్రీడలో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. 'సైకిల్ పోలో ఆడటం చాలా కష్టం. కానీ మంచి తర్ఫీదు ఇవ్వడంతో ఈ ఆటలో రాణిస్తున్నాను' అని రాజేశ్వరి చెప్పింది.

జిమ్‌లో సైక్లింగ్ చేసేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. మోటార్ సైకిల్ వచ్చిన తర్వాత సైకిల్ తొక్కే వారి సంఖ్య తగ్గినప్పటికీ.. చిన్నారులకు మాత్రం సైకిల్ నేర్పడం ప్రతి ఇంటా జరిగేదే. మోటార్ సైకిల్ నేర్చుకునే ముందు సైకిల్ నేర్చుకోవడం తప్పనిసరి.

ఏడు దశాబ్దాలుగా ఇదే వ్యాపారం



మా కుటుంబం 70 ఏళ్లుగా సైకిల్ వ్యాపారం నిర్వహిస్తోంది. మా తండ్రిగారు అమలాపురంలో వ్యాపారం ప్రారంభించారు. ఈ వ్యాపారంలో 36 సంవత్సరాలుగా నేను కూడా భాగమయ్యాను. ఒకప్పటి పాపులర్ కంపెనీలు మూతపడ్డాయి. వ్యాపారం చాలా వరకూ తగ్గింది. చిన్న పిల్లలు, పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు కొంటున్నారు. ధనవంతులు స్టేటస్ కోసం ఖరీదైన సైకిళ్లు కొంటున్నారు.

– నరహరిశెట్టి రాంబాబు, శ్రీవెంకట రమణ సైకిల్ స్టోర్స్, అమలాపురం

ఆరు దశాబ్దాలుగా సైకిల్ రిపేర్



నా వయస్సు 70 ఏళ్లు. నా పదో ఏట నుంచి అంటే సుమారు 60 ఏళ్లుగా సైకిల్ రిపేర్లు చేస్తున్నాను. ఒకప్పుడు ఇంట్లో ఒక్కరికైనా సైకిల్ ఉండేది. అప్పుడు చేతినిండా పని ఉండేది. తరువాత కాలంలో వీటి సంఖ్య తగ్గిపోయింది. మాకు పని కూడా తగ్గింది. మరో వృత్తి తెలియక దీనిలోనే జీవనం సాగిస్తున్నాం.

– చిట్టాల రాధాకృష్ణ, సైకిల్ మెకానిక్, కొత్తపేట

అధునాతన సైకిళ్లు

ఆరోగ్య స్పృహ పెరగడం.. సైక్లింగ్ అభిరుచిగా మారడం.. బై సైకిల్ క్లబ్బులు ఏర్పాటు వంటి కారణాలతో సైకిళ్లకు తిరిగి ఆదరణ పెరుగుతోంది. చాలా కంపెనీలు ఆధునిక సైకిళ్లు తయారు చేస్తున్నాయి. అత్యంత వేగంగా తొక్కడానికి వీలుగా ఎన్నో మార్పులు చేశారు. గేర్లు ఏర్పాటు చేశారు. సాధారణ సైకిల్ ధర రూ.6 వేల నుంచి ఉంటే ఆధునాతన సైకిళ్ల ధర రూ.15 వేల నుంచి రూ.6.50 లక్షల వరకూ ఉంటోంది.



రూ.6.50 లక్షల విలువ చేసే సైకిల్

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలి

అమలాపురం రూరల్: గ్రామ/వార్డు సచివాలయ మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను వారానికోసారి చొప్పున నెలకు నాలుగుసార్లు తనిఖీ చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను, సిబ్బంది పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీ చేసిన వీడియో రికార్డును సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. వివిధ అంశాలపై మండల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. గ్రామాల్లోని గర్భిణుల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను, సిబ్బందిని సన్నద్ధం చేశారు. ఐదేళ్ల లోపు పిల్లల ఆధార్ నమోదు చేయించేలా తల్లిదండ్రులను సచివాలయ సిబ్బంది ప్రోత్సహించేలా చూడాలని ఎంపీడీఓలను సూచించారు. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో నాడు – నేడు పనులకు ఇసుక కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి దుర్గారావుదొర, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి బీమేశ్వర్, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో వ్యవసాయం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- వైఎస్సార్ యంత్రసేవా పథకంలో పరికరాల అందజేత
- 23 ట్రాక్టర్లు, ఒక హార్వెస్టర్ పంపిణీ

అమలాపురం రూరల్: డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా వ్యవసాయ యాంత్రీకరణను సుసాధ్యం చేస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఈ పథకం కింద మెగా మేళా–2లో భాగంగా రైతు గ్రూపులకు వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలు రైతు గ్రూపులకు సబ్సిడీపై అందజేశారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ, జిల్లా 99 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉందని, అందువల్లనే జిల్లా యంత్రాంగం దీనిపై ఎక్కువగా దృష్టి సారించిందని తెలిపారు. వ్యవసాయ పనులకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై రైతు గ్రూపులకు అందించడం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ, జిల్లాలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ పిల్లలను వ్యవసాయ, డెయిరీ, ఫిషరీస్ ఆధారిత కోర్సులు చదివేలా ప్రోత్సహించాలని కోరారు. మరో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం వారికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుభరోసా కేంద్రం (ఆర్‌బీకే) స్థాయిలో 40 శాతం సబ్సిడీ, 50 శాతం రుణ సదుపాయం కల్పిస్తూ, కేవలం 10 శాతం సొమ్ములు చెల్లిస్తే రైతుగ్రూపులకు వ్యవసాయ యంత్ర పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు (బాబీ), ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ ఖాదర్, హిందూ సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కాశి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కొనుకు గౌతమి, గన్నవరం శ్రీనివాసరావు, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సలాది చక్రి తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయెల్ తదితరులు



రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు, హార్వెస్టర్

లబ్ధి చేకూర్చారిలా..

ఆర్‌బీకే స్థాయి యంత్ర సేవా కేంద్రాలు	:	60
లబ్ధి పొందిన రైతులు	:	300
సబ్సిడీ మొత్తం	:	రూ.1.30 కోట్లు
అందజేసిన ట్రాక్టర్లు	:	23
క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాల గ్రూపులు	:	1
లబ్ధి పొందిన రైతులు	:	5
సబ్సిడీ మొత్తం	:	రూ.0.10 కోట్లు

రైతులకు మేలు



వ్యవసాయ యంత్ర పరికరాలను అందించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. మా గ్రూపునకు ట్రాక్టర్ ఇచ్చారు. ఆర్‌బీకే పరిధిలో రైతులకు వ్యవసాయ పనులు చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

– రమణాతి పల్లయ్యశెట్టి, రైతు, నల్లమిల్లి, అమలాపురం మండలం

కంబైన్డ్ హార్వెస్టర్‌తో వరికోతలు



రూ.25 లక్షల విలువైన వరికోత యంత్రాన్ని 40 శాతం రాయితీపై మా గ్రూపునకు ఇచ్చారు. దీనిని ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచుతాం. తక్కువ ధరకే వరి కోతలు కోసేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

– మారిశెట్టి సురేష్, కేశవరం, మండపేట మండలం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వృత్తివిద్యా కోర్సులు, సీట్లు

కళాశాల	కోర్సుల సంఖ్య	సీట్లు
కొత్తపేట	6	240
రావులపాలెం	2	80
రామచంద్రపురం	4	160
మండపేట	1	40
అమలాపురం	1	40
మలికిపురం (ఎయిడెడ్)	2	120
మొత్తం సీట్లు		680

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి వృత్తి విద్యా కోర్సుకు 40 సీట్లు ఉంటాయి. విద్యార్థుల ఆసక్తి చూసిన సీట్ల సంఖ్యను 60 వరకూ పెంచే అవకాశం ఉంటుంది.
- జిల్లాలోని 38 ప్రైవేటు కాలేజీల్లో సుమారు 5,500 ఒకేషనల్ సీట్లు ఉన్నాయి. ప్రతి కళాశాలలో పారామెడికల్ కోర్సుకు 30, ఇతర కోర్సులకు 40 చొప్పున సీట్లు కేటాయించారు.

ఉపాధికి భరోసా

- బాటలు వేస్తున్న ఇంటర్ వృత్తి విద్యా కోర్సులు
- దరఖాస్తులకు అవకాశం
- 14 వరకూ తొలి దశ అడ్మిషన్లు

కొత్తపేట: పదో తరగతి తరువాత ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ చదవాలని ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతారు. ఆ కోర్సులంలో చేరాలనే కోరిక ఉన్నా ఆర్థిక స్తోమత, కుటుంబ నేపథ్యం వంటి కారణాలతో సతమతమవుతుంటారు. అటువంటి విద్యార్థుల కోసం 1985లో కేంద్ర ప్రభుత్వం ఇంటర్‌లో ఒకేషనల్ (వృత్తి విద్య) కోర్సులను ప్రవేశపెట్టింది. ఇవి పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ జాబ్‌మేళాలు, అప్రెంటిస్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తొందరగా లభిస్తున్నాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో జనరల్ కోర్సులతో పాటు అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ (ఏఅండ్‌టీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఈటీ), మెకానికల్ అండ్ ఆటో మొబైల్ టెక్నీషియన్ (ఎంఅండ్‌ఏటీ), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు (ఎంపీహెచ్‌డబ్ల్యూ–ఎఫ్), ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ (ఓఏ), సివిల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ (సీఈటీ), లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్ (ఎల్‌ఎంఅండ్‌డీ), క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ (సీపీఎండ్‌ఎం), ఫిజియోథెరపీ (పీటీ), కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ (సీజీఏ) తదితర వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఇంటర్‌లో చేరేందుకు మొదటి దశ ప్రవేశాలకు ఈ నెల 14 వరకూ అవకాశం ఉంది.



కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఏ కోర్సుతో ఏ ప్రయోజనాలంటే..

ఏఅండ్‌టీ: అకౌంట్స్, ఆదాయ పన్ను సంబంధిత అంశాల్లో ఇంటర్మీడియెట్ స్థాయిలోనే అవగాహన పెంచుకోవచ్చు. దీనివలన సీఏ, ఐసీడబ్ల్యూఏ వంటి ఉన్నత విద్యకు మార్గం సుగమమవుతుంది. అలాగే విద్యార్థి స్వయం ఉపాధి పొందే అవకాశం ఏర్పడుతుంది.

సీఎస్‌ఈ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్ వంటి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ కోర్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. కంప్యూటర్‌కు సంబంధించిన అన్ని అవసరాలనూ తీర్చేలా విద్యార్థి తన కాళ్లపై తాను నిలబడేలా తోడ్పడుతుంది. ఉన్నత విద్యాభ్యాసానికి కూడా ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది.

ఈటీ: విద్యుత్ రంగానికి సంబంధించిన ప్రాథమిక, మాధ్యమిక అవగాహన అందిస్తారు. విద్యార్థి మరింత ఉన్నత విద్య అభ్యసించవచ్చు. లేదా స్వంతగా గృహ, వాణిజ్యపరమైన నిర్మాణాల్లో వైరింగ్ వర్క్స్‌లో రాణిస్తూ జీవితంలో స్థిరపడవచ్చు.

ఎంఅండ్‌ఏటీ: వాహనాలు, యంత్రాల పని విధానంపై అవగాహన కల్పిస్తారు. ఇది చదివిన వారు స్వయం ఉపాధి పొందవచ్చు. ఆసక్తి ఉంటే ఉన్నత విద్య చదవవచ్చు. వివిధ ఆటోమొబైల్ కంపెనీల్లో కూడా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఎంఎల్‌టీ: వివిధ రకాల రక్త పరీక్షలు చేయడానికి అవసరమైన అన్ని రకాల నైపుణ్యాలనూ ఈ విద్యార్థులకు అందిస్తారు. పెద్దాసుపత్రులు, మెడికల్ ల్యాబొరేటరీలలో ఉద్యోగాలకు అవకాశం ఉంటుంది. లేదా సొంతంగా ల్యాబ్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చు. ఉన్నత విద్యకు కూడా అవకాశాలుంటాయి.

ఎంపీహెచ్‌డబ్ల్యూ–ఎఫ్: ఈ కోర్సు అనంతరం ఉన్నత విద్య అభ్యసించవచ్చు. లేదా స్థానిక ప్రైవేటు ఆస్పత్రుల్లో నర్సులుగా ఉద్యోగాలు పొందవచ్చు.

లక్ష్యానికి అనుగుణంగా..



జీవితంలో ఎలా స్థిరపడాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, అందుకు సంబంధించిన గ్రూపుల్లో చేరాలి. ఉత్తమ ఫలితాలకు ఇష్టపడి చదవాలి. మా కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ (ఇంగ్లిష్, తెలుగు మీడియం) హెచ్‌ఈసీ (తెలుగు మీడియం) జనరల్ కోర్సులతో పాటు ఆరు ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

– పీఎస్ బాలాజీ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తపేట

పేద విద్యార్థులకు వరం



పేద, మధ్యతరగతి విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు ఒక వరం. సాధారణ కోర్సుల కంటే వీటికి మంచి డిమాండ్ ఉంది. రెండేళ్లు కష్టపడి చదివితే వెంటనే ఉపాధి పొందే మార్గాలు అనేకం లభిస్తాయి. పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించి, చదువుకోలేని విద్యార్థులు ఈ కోర్సులు అభ్యసించి, జీవితంలో త్వరగా స్థిరపడవచ్చు.

– తులశమ్మ వీఎస్‌ఎన్‌కేఎస్ శాస్త్రి, జూనియర్ లెక్చరర్, సీఎస్‌ఈ విభాగం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తపేట

క్లుప్తంగా

తాగిన మైకంలో పసికందుపై పడిన తండ్రి

● చిన్నారి దుర్మరణం



చిన్నారి దివ్య మృతదేహం

గోపాలపురం: కల్లు తాగిన మైకంలో తండ్రి మీద పడటంతో ఓ పసికందు మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. గోపాలపురం ఎస్సై కె.రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేములూరి గాంధీ కూలి పనికి వెళ్లి మార్గం మధ్యలో కల్లు తాగి ఇంటికి చేరుకున్నాడు. మైకంలో జోగుతూ ఇంటి వద్ద నులక మంచంపై పడుకున్న ఆరు నెలల తన కన్న కూతురు బేబీ దివ్యపై ఒక్కసారిగా పడ్డాడు. దీంతో ఊపిరి ఆడక ఆ చిన్నారి అల్లల్లాడిపోయింది. కదలకుండా పడి ఉన్న ఆ చిన్నారిని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే దివ్య మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. గాంధీ భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు అద్దాలు ధ్వంసం చేసిన యువకుడికి రిమాండ్

నిడదవోలు: హౌరా – చెన్నై మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లు విసిరిన యువకుడికి రైల్వే కోర్టు రిమాండ్ విధించింది. నిడదవోలు ఆర్‌పీఎఫ్ ఏఎస్సై పీఎస్ఎన్ మూర్తి ఈ విషయం శుక్రవారం తెలిపారు. పట్టణంలోని చినకాశిరేవు సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గత నెల 30వ తేదీ రాత్రి బి.రవి అనే యువడుకు మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి విజయవాడ వైపు మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తోంది. ఆ రైలుపై రవి రాళ్లు విసిరాడు. దీంతో రైలు బి6 ఏసీ కోచ్ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆ బోగీలో అద్దం వద్ద ఉన్న ప్రయాణికులు వెంటనే విధి నిర్వహణలో ఉన్న టీసీ కె.విజయకృష్ణకు సమాచారం ఇచ్చారు. ఆయన విజయవాడ రైల్వే సెక్యూరిటీ విభాగానికి, అక్కడి నుంచి నిడదవోలు ఆర్‌పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందింది. ఈ సంఘటనపై గత నెల 31న నిడదవోలు ఆర్‌పీఎఫ్ ఏఎస్సై పీఎస్ఎన్ మూర్తి తన సిబ్బందితో విచారణ చేపట్టారు. అదే రోజు సాయంత్రం నిందితుడు రవి మళ్లీ చినకాశిరేవు రైల్వే ట్రాక్ వద్దకు వచ్చాడు. అతడిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా, రైలుపై రాళ్లు విసిరినట్టు ఒప్పుకొన్నాడు. దీంతో రవిని అరెస్టు చేసి, విజయవాడ రైల్వే కోర్టుకు తరలించారు. కోర్టు అతడికి రిమాండ్ విధించిందని ఏఎస్సై మూర్తి తెలిపారు.

విద్యాప్రాప్తి.. నైపుణ్యదీప్తి

- ఉత్సాహంగా.. ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిబిరాలు
- లైబ్రరీలను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు
- స్పందన అనూహ్యమంటున్న లైబ్రేరియన్లు

రాయవరం: వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం వివిధ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసింది. వీటికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. గత నెల 8న ప్రారంభమైన ఈ శిబిరాలు పాఠశాలలు పునఃప్రారంభించే వరకూ కొనసాగనున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులను సమ్మర్ క్యాంపులకు పంపించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. విద్యార్థులు కూడా తమకు ఇష్టమైన కథల పుస్తకాలు చదవడం, తిరిగి ఆ కథలను సొంత మాటల్లో చెప్పడంతో పాటు ఆటపాటలతో ఆనందిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన వేసవి శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు 101 లైబ్రరీలు, 7 గ్రామీణ గ్రంథాలయాలు, 158 పుస్తక అభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని 77 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సగటున 1,700 మంది చిన్నారులు ఈ శిబిరాల్లో పాల్గొని విజ్ఞాన సముపార్జన చేస్తున్నారు.

వీటిల్లో శిక్షణ

వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు పుస్తకాలు, కథలు చదవడం, కథ వినడం ద్వారా వినగలిగే సామర్థ్యం పెంపొందించడం, కథలు రాయడం, చెప్పడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం, డ్యాన్స్, యోగా, ధ్యానం, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాల్లో నిపుణులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారు. చెస్, క్యారమ్స్ వంటి పలు రకాల ఆటలు ఆడిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వీటిని నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆడుతూ, పాడుతూ ఏకకాలంలో విజ్ఞానం, వినోదం పొందుతున్నారు. ఈ శిబిరాల్లో విద్యార్థుల ప్రతిభకు పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యావేత్తలను న్యాయ నిర్ణేతలుగా వినియోగించుకుంటున్నారు.



వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థుల ఆటపాటలు

మంచి విషయాలు నేర్పిస్తున్నారు



సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకున్నాను. నిపుణులతో మంచి విషయాలు బోధిస్తున్నారు. కథల పుస్తకాలు చదవడంతో భాషపై పట్టు వస్తోంది. విద్యార్థి దశ నుంచే మంచి విషయాలు బోధించేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడుతున్నాయి.

– ఎం.యోగితశ్రీ సాయి, విద్యార్థిని, మాచవరం, రాయవరం మండలం

స్పందన బాగుంది



వేసవి విజ్ఞాన శిబిరాలకు చిన్నారుల నుంచి స్పందన చాలా బాగుంది. వారు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వస్తున్నారు. ఈ క్యాంపు వలన గ్రంథాలయాల విలువను విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారు. పుస్తక పఠనం అలవాటు పెరుగుతుంది.

– ప్రమీల, లైబ్రేరియన్, రాయవరం మండలం

విజయవంతంగా సాగుతోంది



వేసవి శిక్షణ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధికంగా పాల్గొంటున్నారు. తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన ఉంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సమ్మర్ క్యాంపులు దోహదపడుతున్నాయనడంలో సందేహం లేదు.

– వీఎల్ఎన్ సాయి వరప్రసాద్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కాకినాడ

అత్తమామలపై అల్లుడి దాడి

- అప్పు తీర్చే విషయంపై గొడవ
- చిన్న గ్యాస్ సిలిండర్‌తో కొట్టడంతో మామ హతం
- చావుబతుకుల మధ్య అత్త

కొవ్వూరు: అప్పు తీర్చే విషయంలో జరిగిన గొడవలో అల్లుడి చేతిలో మామ హతమైన ఘటన పశివేదల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన నందిగం గోపికి, పశివేదల గ్రామానికి చెందిన రాయంకుల శ్రీరామకృష్ణ (62) కుమార్తె లక్ష్మితో పదకొండేళ్ల కిందట రెండో పెళ్లి చేశారు. గోపి కొన్నేళ్లుగా అత్తవారింట్లో ఇల్లరికం ఉంటున్నాడు. లక్ష్మి మొదటి భర్త కుమారుడికి ఆమె తల్లిదండ్రులు 4.4 ఎకరాల పొలం ఇచ్చారు. రెండో భర్త అయిన గోపి తరచూ అప్పులు చేస్తే వాటిని లక్ష్మి తల్లిదండ్రులే తీర్చుతూండేవారు.

ఈ నేపథ్యంలో పశివేదల బ్యాంకులో గోపి రూ.2.20 లక్షల పంట రుణం తీసుకున్నాడు. అలాగే, భార్య లక్ష్మి బంగారం బ్యాంకులో తనఖా పెట్టి కూడా అప్పు తీసుకున్నాడు. ఇదిలా ఉండగా లక్ష్మి మొదటి భర్త కుమారుడికి ఇచ్చిన భూమిని గోపి అమ్ముతూ మరికొన్ని అప్పులు తీరుస్తున్నాడు. బ్యాంకులో తనఖా పెట్టిన తన కుమార్తె బంగారం కూడా విడిపించాలని అల్లుడు గోపికి మామ శ్రీరామకృష్ణ చెప్పాడు. ఈ నేపథ్యంలో బ్యాంకులో చేసిన అప్పు రూ.2.20 లక్షలు తీర్చాలంటూ మామతో గోపి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన గోపి.. అక్కడే ఉన్న చిన్న గ్యాస్ సిలిండర్‌తో మామ తలపై ఒక్కసారిగా కొట్టాడు. తలకు బలమైన గాయం అవడంతో శ్రీరామకృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తన భర్తను ఎందుకు కొడుతున్నావంటూ అడిగిన అత్త బేబీపై కూడా సిలిండర్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెతో పాటు ఆ సమయంలో ఇంట్లో ఉన్న లక్ష్మి కూడా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న రూ.5 లక్షల నగదు తీసుకుని గోపి మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. సంఘటన స్థలాన్ని రూరల్ ఎస్సై జి.సతీష్ పరిశీలించారు. హతుడి కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశారు. శ్రీరామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



శ్రీరామకృష్ణ మృతదేహం

ప్రాణం పోసిన ఆరోగ్యశ్రీ

కాకినాడ రూరల్: రెక్కాడితేనే కానీ డొక్కాడని వ్యవసాయ కుటుంబం.. ఒక్కగానొక్క కొడుకు.. 21 సంవత్సరాలకే కిడ్నీ (మూత్రపిండం) సమస్య.. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించక తప్పని దుస్థితి.. అటు కొడుకు అనారోగ్యం, ఇటు ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్న ఆ తల్లిదండ్రులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం తోడుగా నిలిచింది.. ఇదే తరుణంలో తన కిడ్నీ ఇచ్చి, తన బిడ్డకు పునర్జన్మనిచ్చేందుకు ఆ తల్లి ముందుకు వచ్చింది.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి చేయించి ఆ తల్లిదండ్రులు తమ బిడ్డను కాపాడుకున్నారు. వివరాలివీ..

తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం వెంకటాపురానికి చెందిన 24 ఏళ్ల యువకుడు బోడెం సుబ్రహ్మణ్యం కిడ్నీ సమస్యతో బాధపడేవాడు. అతడిని తల్లిదండ్రులు గంగారత్నం, కృష్ణ కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ అన్ని వైద్య పరీక్షలూ చేసిన వైద్యులు సుబ్రహ్మణ్యానికి కిడ్నీ మార్పిడి చేయాలని చెప్పారు. తన బిడ్డకు తన కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకు వచ్చింది. దీంతో ఆరోగ్యశ్రీ పథకం కింద అన్ని అనుమతులూ తీసుకుని గత నెల 13న మెడికవర్ ఆసుపత్రి వైద్యులు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. మూడు రోజుల్లో తల్లిని, వారం రోజుల్లో పేషెంట్‌ను డిశ్చార్జ్ చేశారు. తమ ఆసుపత్రిలో తొలిసారిగా నిర్వహించిన కిడ్నీ మార్పిడి విజయవంతమైందని వైద్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుబ్రహ్మణ్యం, తల్లి గంగారత్నం మాట్లాడారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ తేజాకృష్ణ మాట్లాడుతూ, మూత్రపిండాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. రక్తంలోని వ్యర్థాలను వడకడుతూ మూత్రపిండాలు శరీరంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వీటి పనితీరు మందగించి, అవి విఫలమవడం మొదలైతే పూర్తిగా నయం చేయడం కష్టమన్నారు. యూరాలజిస్టు డాక్టర్ కేవీ ప్రసాద్ మాట్లాడుతూ, కిడ్నీలు పూర్తిగా చెడిపోయిన వారికి తాత్కాలిక రక్తశుద్ధి(డయాలసిస్)తో పాటు కిడ్నీ మార్పిడి చేయవచ్చని అన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ, తమ ఆసుపత్రిలోని అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో సుబ్రహ్మణ్యం క్షేమంగా ఉన్నాడని చెప్పారు.



సుబ్రహ్మణ్యంతో తల్లి గంగారత్నం, వైద్యులు

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ

కిడ్నీ సమస్యతో బాధ్య పడుతూ కొంత కాలానికే మరణించే స్థితికి చేరుకున్న నా కొడుకు సుబ్రహ్మణ్యానికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పునర్జన్మ ఇచ్చారు. కిడ్నీ మారిడికి ప్రభుత్వం రూ.2.6 లక్షలు మంజూరు చేసింది. కిడ్నీ మార్పిడి చేసి 21 రోజులైంది. నా బిడ్డ, నేను క్షేమంగా ఉన్నాం. ప్రభుత్వానికి, వైద్యులకు ధన్యవాదాలు.

– బోడెం గంగారత్నం, కిడ్నీ బాధితుడి తల్లి

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



సుదర్శన పెరుమాళ్‌కు చక్రస్నానం చేయిస్తున్న రుత్విక్కులు

మామిడికుదురు: వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి చక్రస్నానం వైనతేయ గోదావరి నదిలో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామ స్మరణలు, వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సుదర్శన పెరుమాళ్‌కు నదీజలాల్లో పుణ్యస్నానం చేయించారు. గ్రహ, అపమృత్యు దోషాలను నివారించే స్వామిగా ప్రాచుర్యం పొందిన సుదర్శన పెరుమాళ్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు గోవింద నామం స్మరిస్తూ నదిలో తలారా స్నానం చేసి పునీతులయ్యారు. తొలుత ఉభయ దేవేరులతో కొలువు తీరిన శ్రీవారిని ముందుగా పల్లకిలో ఊరేగిస్తూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు వసంతాలు చల్లుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా వసంతోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారితో పాటు సుదర్శన పెరుమాళ్‌కు నదీతీరంలో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్రస్నానం జరిపించారు. ప్రధానార్చకుడు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్య బృందం ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. శ్రీవారికి సహస్రనామార్చన, బాలభోగం నివేదన, వేదపారాయణ, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి, ధ్వజావరోహణ, మంగళాశాసనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, బత్తుల గంగారత్నం, మానుపాటి సూర్యకుమారి, దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



వెంకటేశ్వర్లు (పాతచిత్రం)

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన రామాడి వెంకటేశ్వర్లు (48) వేటకు వెళ్లి శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర్లు రోజూ మాదిరిగానే ఉదయం 10.30 గంటల సమయంలో చినవలసల, చినబొడ్డు వెంకటాయపాలెం సరిహద్దున ఉన్న కాలువలోకి వేటకు వెళ్లాడు. సముద్రం పోటుపాటులకు నీరు వచ్చే ఈ కాలువలో వలకట్టు కడుతున్నాడు. ఆ క్రమంలో వలకు కాలు చిక్కుకుని కాలువలో మునిగి, మృతి చెందాడు. వెంకటేశ్వర్లు భార్య సుమారు 15 ఏళ్ల క్రితం మృతి చెందింది. తమ ముగ్గురు కుమారుల బాగోగులను వెంకటేశ్వర్లే చూసుకుంటున్నాడు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గాడిమొగ వీఆర్ఓ పలివెల అర్జున రావు ఫిర్యాదు మేరకు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పట్టుబడిన 'బంగారు' దొంగ



పట్టుబడిన సొత్తు, నిందితుడిని చూపుతున్న డీఎస్పీ లతాకుమారి, సీఐ కిషోర్‌బాబు, ఇన్‌చార్జి ఎస్సై అజయ్‌బాబు

అన్నవరం: సుమారు ఏడాది కాలం నుంచి అన్నవరంలోని పలు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీలు చేసి, తప్పించుకుని తిరుగుతున్న ఓ దొంగ ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో అన్నవరానికి చెందిన ఆదిరెడ్డి లక్ష్మి ఇంట్లో 28 గ్రాముల బంగారు ఆభరణాలు, 317 గ్రాముల వెండి వస్తువులు చోరీ అయ్యాయి. నవంబర్‌లో పరుపురెడ్డి సోంబాబు ఇంట్లో 24 గ్రాముల బంగారు, 960 గ్రాముల వెండి వస్తువులు చోరీ అయ్యాయి. అలాగే డిసెంబర్ నెలలో ఏనుగుపల్లి శ్రీదేవి ఇంట్లో 8 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ దొంగతనాలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు, అన్నవరం ఇన్‌చార్జి ఎస్సై అజయ్‌బాబు దర్యాప్తు చేపట్టారు. తుని వెలంపేట కాలనీకి చెందిన మనీష్‌కుమార్‌సింగ్ ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. అన్నవరంతో పాటు ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా మనీష్‌కుమార్‌సింగ్ బంగారం, వెండి అపహరించినట్టు పోలీసు విచారణలో తేలింది. నిందితుడి నుంచి 87 గ్రాముల బంగారం, 852 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన అన్నవరం హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, డ్రైవర్ లోవరాజులను డీఎస్పీ లతాకుమారి అభినందించారు.

బాలికను మోసగించిన వ్యక్తి అరెస్టు

అమలాపురం రూరల్: బాలికను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసి, శుక్రవారం కోర్టుకు తరలించామని తాలూకా ఎస్సై అందే పరదేశి తెలిపారు. ఇమ్మిడివరప్పాడుకు చెందిన యలగన గణేష్ అదే గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, డీఎస్పీ అంబికా ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గణేష్‌ను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక దుర్మరణం

అమలాపురం రూరల్: మట్టి ట్రాక్టర్ ఢీకొని ఓ బాలిక దుర్మరణం పాలైంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నడిపూడి గ్రామ పరిధి అప్పారివారిపాలేనికి చెందిన పెనుమాల ప్రశాంతి (16), సరెళ్ల మానస, సరెళ్ల సత్యభాను కలసి కిరాణా సరకుల కోసం శుక్రవారం నడిపూడి లాకుల వద్దకు వచ్చారు. సరకులు తీసుకుని ఇంటికి తిరిగి నడిచి వెళ్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మట్టి ట్రాక్టర్ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రశాంతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మానస, సత్యభాను తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో హుటాహుటిన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియడంతో బాధితుల తల్లిదండ్రులు, స్థానికులు అక్కడకు చేరుకున్నారు. పదో తరగతి చదివిన ప్రశాంతి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రూరల్ సీఐ వీరబాబు, తాలూకా ఎస్సై అందే పరదేశి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మట్టి ట్రాక్టర్లు ఇష్టానుసారం తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు, మైనింగ్, రవాణా శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని, అందువల్లే నిండు ప్రాణం బలైపోయిందని స్థానికులు మండిపడ్డారు. సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, ప్రశాంతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు.



సంఘటన స్థలంలో ప్రశాంతి మృతదేహం